సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 8 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



బంగారు వర్ణంలో తాబేలు

మడకశిర మండలం కల్లుమర్రి చెరువులోని నీటి గుంతలో శుక్రవారం కొందరు చేపల కోసం వల వేయగా బంగారు వర్ణంలోని తాబేలు పడింది.

గరిష్టం/కనిష్టం

35.2°/21.4°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

- కళ్యాణదుర్గం వేదికగా రైతు దినోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- అక్కడి నుంచే వైఎస్సార్ ఉచిత పంటల బీమా సొమ్ము విడుదల
- రాష్ట్రంలోని 10.2 లక్షల మంది రైతులకు రూ.1,117.21 కోట్ల లబ్ధి

నేడు సీఎం రాక



కళ్యాణదుర్గం/ కళ్యాణదుర్గం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. కళ్యాణదుర్గంలో శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న రైతు దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. అక్కడి నుంచే ఖరీఫ్–2022లో రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి 10.20 లక్షల మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.1,117.21 కోట్ల పరిహారం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని సీఎం బటన్ నొక్కి ప్రారంభిస్తారని కలెక్టర్ గౌతమి మీడియాకు వెల్లడించారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 2,65,114 మంది రైతులకు రూ.370.58 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. కాగా.. సీఎం ఉమ్మడి జిల్లాలో పర్యటించడం ఇది ఆరోసారి.



కళ్యాణదుర్గంలో సీఎం జగన్‌కు స్వాగత ఫ్లెక్సీలు

సీఎం పర్యటన సాగుతుందిలా...

- ఉదయం 8.30 గంటలకు సీఎం జగన్ గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి బయల్దేరి 9.15 గంటలకు పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.
- 9.30 గంటలకు పుట్టపర్తి ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 9.50 గంటలకు కళ్యాణదుర్గం హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 9.50 నుంచి 10 గంటల వరకు హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో పరిచయం.
- 10 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటారు.
- 10.10 నుంచి 10.25 గంటల వరకు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అగ్రిల్యాబ్ శిలాఫలాకాన్ని ప్రారంభిస్తారు.
- 10.30 గంటలకు సభా వేదికపైకి చేరుకుంటారు. జిల్లా ప్రగతిపై కలెక్టర్ గౌతమి ప్రసంగిస్తారు. అనంతరం రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి అవుతారు. అనంతరం ఖరీఫ్–2022కు సంబంధించిన వైఎస్సార్ ఉచిత పంటల బీమా మెగా చెక్కును విడుదల చేస్తారు.
- 12.05 గంటలకు సీఎం జగన్ సభా ప్రాంగణం నుంచి రోడ్డు మార్గాన హెలిప్యాడ్‌కు బయల్దేరుతారు.
- 12.15కు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.15 నుంచి 12.45 వరకు స్థానిక నాయకులతో సమావేశమవుతారు.
- 12.55 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయకు వెళతారు.

భద్రత కట్టుదిట్టం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు భద్రత కట్టుదిట్టం చేసినట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పర్యటనకు శనివారం వస్తున్న సీఎం గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం చేరుకుని ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో కళ్యాణదుర్గం వెళ్లనున్నారు. ఈనేపథ్యంలో ఎస్పీ పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం సత్యసాయి విమానాశ్రయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సిబ్బందితో సమావేశమై భద్రతపై దిశానిర్దేశం చేశారు. సీఎం ఉదయం 9.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారని, 9.25 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో కళ్యాణదుర్గం బయలుదేరి వెళ్తారన్నారు. భద్రతా పరంగా ఎక్కడా పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ముగ్గురు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 19 మంది ఎస్ఐలు, 91 మంది ఏఎస్ఐలు, 135 మంది కానిస్టేబుళ్లు, 62 మంది హోంగార్డులతో పాటు ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు.

క్లుప్తంగా

అల్లుఅర్జున్ సందడి



గార్లదిన్నె: మండల పరిధిలోని ఎగువపల్లి సమీపంలో44వ జాతీయ రహదారి పక్కన ముంటిమడుగు కేశవరెడ్డి గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం సినీహీరో అల్లు అర్జున్ సందడి చేశారు. అల్లుఅర్జున్ హైదరాబాద్ నుంచి తన స్నేహితులతో కలసి బెంగళూరుకు వెళ్తూ గార్లదిన్నె మండలం ఎగువపల్లి సమీపంలో గేస్ట్‌హౌస్ వద్ద వాహనాలు ఆపి భోజనం చేసి కొంతసేపు విరామం తీసుకొని అక్కడ నుంచి బెంగళూరుకు వెళ్లారు. సమాచారం తెలుసుకున్న కొందరు అభిమానులు గెస్ట్‌హౌస్ వద్దకు వెళ్లి అల్లుఅర్జున్‌తో ఫొటోలు దిగారు.

విద్యుదాఘాతానికి తండ్రి, కుమార్తె బలి



రామకృష్ణారెడ్డి, నిర్మల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పావగడ: విద్యుదాఘాతంతో తండ్రి, కుమార్తె మృత్యువాత పడిన ఘటన మడకశిర మండలం ఎల్లోటి గ్రామ శివార్లలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... రామకృష్ణారెడ్డి (73), ఆయన కుమార్తె నిర్మల (45) బసవనహళ్లి సమీప సరిహద్దులోని మడకశిర మండలానికి చెందిన ఎల్లోటిలోని తమ వ్యవసాయ భూమిలో మిరప పంట సాగు చేశారు. జింకల బెడదతో తోట చుట్టూ విద్యుత్ తీగల కంచె ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రామకృష్ణారెడ్డి చేయి పొరపాటున విద్యుత్ తీగకు తగలడంతో కింద పడిపోయారు. పక్కనే ఉన్న కుమార్తె నిర్మల తండ్రిని కాపాడపోయి తాను సైతం విద్యుదాఘానికి గురైంది. ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డారు. తండ్రి , కుమార్తె ఒక్కసారే మృతి చెందడంతో బసవనహళ్లిలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పండుగలా వ్యవ'సాయం'



సందర్భం నేడు వైఎస్సార్ జయంతి (రైతు దినోత్సవం)



- నాడు వైఎస్సార్ .. నేడు జగన్
- రైతులకు అన్ని విధాలా అండగా వైఎస్ కుటుంబం
- రైతు భరోసా, ఆర్‌బీకే, యంత్ర సేవ ద్వారా లబ్ధి



ఈ రైతు పేరు క్రిష్ణప్ప. వీరిది రొళ్ల మండలం మల్లసముద్రం. పొలంలో రెండు వ్యవసాయ బోర్లు ఉన్నాయి. గత 2004కు ముందు విద్యుత్ చార్జీలు చెల్లించలేక రూ.వేలల్లో బకాయి ఉండేది. అయితే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం కాగానే బకాయిలు మాఫీ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక.. అన్ని విధాలా రైతులకు అండగా నిలిచారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇక్కడ కనిపిస్తున్న రైతు పేరు రెడ్డి శేఖర్. కదిరి మండలం దిన్నెమీదపల్లికి చెందిన రైతు. ఆర్థిక సమస్యల కారణంగా చాలా ఏళ్ల పాటు అద్దె ట్రాక్టర్లతో పొలాలు దున్నించేవాడు. అయితే వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత వైఎస్సార్ యంత్ర సేవ పథకంలో భాగంగా 50 శాతం రాయితీతో సొంత ట్రాక్టర్ తెచ్చుకోగలిగాడు. ప్రస్తుతం ఏ ఇబ్బందీ లేకుండా ఆరు ఎకరాల్లో సజ్జ, మిరప, టమాట సాగు చేస్తున్నానని సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి, పుట్టపర్తి: మట్టి నుంచి పుట్టిన మొక్కకి... చెట్టు మీద పెరిగే పరాన్నజీవికి ఎంత తేడా ఉంటుందో జనం నుంచి పుట్టిన నాయకుడికి, అధికారం లాక్కున్న నాయకుడికి మధ్య కూడా అంతే తేడా ఉంటుంది. ముఖ్యంగా రైతు వర్గాలకు న్యాయం చేసే విషయంలో గట్టిగా అడుగులు పడకపోతే... తరాలు మారినా తల రాతలు మారవని గట్టిగా నమ్మిన దార్శనికుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరహాలోనే వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు.

కొంతకాలంలోనే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి పనిచేసింది కేవలం ఐదేళ్ల మూడు నెలలే. ఆ కొద్దికాలంలోనే తెలుగునేల ఆయన్ను కలకాలం గుర్తుంచుకునేలా సుపరిపాలన అందించారు. తండ్రికి తగ్గ తనయుడిగా అదే తరహాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా.. ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేస్తూ తనదైన ముద్ర వేసుకున్నారు.

పథకాలకు మరింతగా మెరుగులు

'వ్యవసాయం దండగ కాదు.. పండుగ ' అన్న మహానేత వైఎస్సార్ మాటలను మరోసారి చేసి చూపిస్తున్నారు వైఎస్ జగన్. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ రైతన్నల కోసం అనేక పథకాలు అమలు చేశారు. నాడు వైఎస్సార్ అమలు చేసిన ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలకు మరింతగా మెరుగులు దిద్ది కొనసాగిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ యంత్ర సేవతో పాటు పంచాయతీ కేంద్రాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారు. మరోసారి 'రాజన్న రాజ్యం' వచ్చిందంటూ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల వివరాలు

సన్నకారు రైతులు (హెక్టారు వరకు భూమి కల్గిన వారు)	1,58,870
చిన్నకారు రైతులు (రెండు హెక్టార్ల వరకు)	1,20,008
మధ్యస్థ రైతులు (పది హెక్టార్ల వరకు)	86,045
పెద్ద రైతులు (పది హెక్టార్ల పైన)	952

సాధారణ సాగు విస్తీర్ణం	3,23,763 హెక్టార్లు
సాగు చేసిన విస్తీర్ణం	8,596 హెక్టార్లు
జిల్లాలోని ఆర్‌బీకే కేంద్రాలు	416
అందిస్తున్న సేవలు	విత్తనాలు, ఎరువుల పంపిణీ
సున్నా వడ్డీ రుణాలు	3,340 మంది రైతులకు
చేకూరిన లబ్ధి	రూ.2,549 కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	2,75,331 మందికి
జమైన నగదు	రూ.206.49 కోట్లు (తొలివిడత)
ఉచిత పంటల బీమా (2019 - 22 వరకు)	రూ.565 కోట్లు
వైఎస్సార్ యంత్రసేవలో అందజేసిన పరికరాలు	585
మొత్తం ఖర్చు	15,138 కోట్లు
రాయితీ	రూ.5,485 కోట్లు

రైతుకు 'భరోసా'



రైతు భరోసా కేంద్రాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి. గతంలో వేరుశనగ కొనుగోలు చేయాలంటే ఉదయం నుంచి రాత్రి వరకు వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్‌బీకే (రైతు భరోసా కేంద్రం) లకే వేరుశనగ విత్తనకాయలు వస్తున్నాయి.

– రైతు శివశంకర్ రెడ్డి, వెంకటాపురం, చిలమత్తూరు

సర్కారు అండగా నిలుస్తోంది



పంట సాగు చేసే సమయానికి రైతు భరోసా పథకం కింద రూ.5,500 బ్యాంక్ ఖాతాలో జమ అవుతోంది. దీంతో విత్తనాలు ఎరువులు, కొనుగోలు చేస్తున్నాం. ప్రతి ఏటా సమయానికి రైతు భరోసా రావడంతోనే పంట సాగు చేయడం సులభం అవుతోంది.

– రైతు అంకె గోపాల్, కనగానపల్లి మండలం

నేడు పుట్టపర్తిలో రైతు దినోత్సవం

పుట్టపర్తి అర్బన్: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం బీడుపల్లి సమీపంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద జిల్లా స్థాయి రైతు దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే రైతు దినోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి పాల్గొంటారన్నారు. రైతులు పెద్దఎత్తున విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడ్డ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఐచర్‌లో తరలిస్తున్న 260 ప్యాకెట్ల (50 కిలోలు) రేషన్‌బియ్యాన్ని శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్‌ఐ మురళి సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టగా ధర్మవరం వైపు నుంచి ఐచర్ వాహనంలో రేషన్ బియ్యాన్ని బెంగళూరుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్ ఆనంద్‌ను ప్రశ్నించగా ధర్మవరానికి చెందిన రాజశేఖర్ అనే వ్యాపారి బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని పెనుకొండ స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జమేదార్ ఆది తెలిపారు.

ఐదో తరగతి ప్రవేశాలకు కౌన్సెలింగ్

అనంతపురం రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశం కోసం మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలు, కళాశాల జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. మెరిట్ ఆధారంగా 11, 12 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. 11న కురుగుంట గురుకుల పాఠశాలలో బాలురకు, 12న బి.పప్పూరులో బాలికలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. https: //apgpcet. apcfss.in వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను విద్యార్థులు చూసుకోవచ్చన్నారు.

విధుల్లోకి తాగునీటి కార్మికులు



గేట్‌వాల్వ్ తెరుస్తున్న కార్మికులు

కూడేరు: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5 నుంచి సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సమ్మెబాట పట్టారు. అయితే కలెక్టర్ గౌతమి చొరవతో శుక్రవారం సాయంత్రం సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 165 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. తాగునీటి కార్మిక యూనియన్ నేతలుతో, ప్రజా సంఘాల నేతలతో స్వయంగా కలెక్టర్ తన బంగ్లాలో శుక్రవారం చర్చలు జరిపినట్లు యూనియన్ నేతలు తిప్పయ్య, శ్రీనివాసులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని , విధుల్లోకి వెళ్లాలని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులమంతా విధుల్లో చేరినట్లు వారు తెలిపారు. తాగునీటిని బంద్ చేసి ప్రజలను ఇబ్బంది పెట్టాలన్నది తమ కోర్కె కాదన్నారు. డిమాండ్ల సాధన కోసమే సమ్మెలోకి వెళ్లినట్లు వారు తెలిపారు.

అన్నదాతకు జగన్ సర్కారు వెన్నుదన్ను

- నాలుగేళ్లలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద జిల్లాకు రూ.1,855 కోట్లు విడుదల
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా చీనీ, దానిమ్మ, ద్రాక్ష, టమాట రైతులకూ బీమా
- చంద్రబాబు హయాంలో 2014-18 మధ్య ఇచ్చిన బీమా రూ.714 కోట్లే
- అందులోనూ ప్రీమియం రూపంలో రైతుల నుంచి రూ.326 కోట్ల వసూళ్లు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అన్నదాతకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామగ్రామాన ఆర్‌బీకే వ్యవస్థను ప్రవేశపెట్టి వ్యవసాయ సేవలను రైతు ముంగిటకు తీసుకొచ్చింది. విత్తు మొదలు పంటల విక్రయం వరకు తోడుగా ఉండి వ్యవసాయాన్ని పండుగలా చేసింది. పంటలు పండకపోయినా 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'తో , 'నేనున్నా' అంటూ ముఖ్యమంత్రి జగన్ రైతులకు ధీమా కల్పిస్తున్నారు. రైతులపై ప్రీమియం భారం పడకుండా ఖరీఫ్, రబీలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేస్తున్నారు. ఈ-క్రాప్ డేటా, ఆన్‌లైన్ వెదర్ డేటా, పంట కోత ప్రయోగాల ఫలితాల ఆధారంగా నష్టపోయిన ప్రతి రైతుకూ పంటల బీమా కింద సాయం అందిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పరిహారమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఈ నాలుగేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 11.21 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,855 కోట్ల బీమా పరిహారం ఇవ్వడం విశేషం. దీంతో పాటు ప్రీమియం రూపంలో జిల్లా రైతులకు ఏటా రూ.120 కోట్ల వరకు మిగులుబాటు అవుతోంది. ఈ లెక్కన నాలుగేళ్లలో ప్రీమియం రూ.480 కోట్లు ఆదా అయ్యింది. ఇది కూడా కలుపుకుంటే జిల్లా రైతులకు రూ.2,335 కోట్ల వరకు లబ్ధి చేకూర్చారు. ప్రధానంగా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా చీనీ, దానిమ్మ, ద్రాక్ష, మిరప, టమాట, అరటి లాంటి పంటలకు బీమా వర్తింపజేశారు. చంద్రబాబు హయాం (2014-2018)లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఐదేళ్లలో 10.95 లక్షల మంది రైతులకు గాను రూ.714.07 కోట్ల పంటల బీమా పరిహారం ఇచ్చారు. అందులో రైతుల నుంచే ప్రీమియం రూపంలో రూ.325.91 కోట్లు పిండుకున్నారు. అంటే ప్రీమియం పోనూ వాస్తవంగా చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చింది రూ.388 కోట్లు మాత్రమే కావడం విశేషం.

చంద్రబాబు హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు పంటల బీమా ఇలా..

సంవత్సరం	కట్టిన ప్రీమియం రూ.కోట్లలో	వచ్చిన పరిహారం రూ.కోట్లలో	రైతుల సంఖ్య
2014 -15	14.09	25.61	47,627
2015-16	115.06	109.66	1,85,194
2016-17	44.64	419.10	5,07,658
2017-18	72.10	159.70	3,10,115
2018-19	80.02	--	--
మొత్తం	రూ.325.91 కోట్లు	రూ.714.07 కోట్లు	10,50,594 మంది

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు పంటల బీమా

సంవత్సరం	లబ్ధి పొందిన రైతుల సంఖ్య	వచ్చిన పరిహారం రూ.కోట్లలో
2019-20	2,46,649	266.42
2020-21	2,05,291	362.25
2021-22	4,04,461	855.55
2022-23	2,65,114	370.58
మొత్తం	11,21,515	రూ.1,854.80 కోట్లు

'లింగనిర్ధారణ' చేస్తే కఠిన చర్యలు

- పీసీపీఎన్‌డీటీ యాక్ట్ పకడ్బందీగా అమలు
- కలెక్టర్ అరుణ్‌బాబు



అంతరాష్ట్ర వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు అంతర్‌రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్, తుమకూరు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో లింగ నిష్పత్తి 970/1000గా ఉందన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో లింగ నిష్పత్తి శాతం తక్కువగా ఉందన్నారు. ఇందుకు భ్రూణహత్యలు కూడా కారణమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుంటే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డిని ఆదేశించారు. అనుమతుల్లేని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు మండలాల్లోని పలువురు గర్భిణులు చిక్‌బల్లాపూర్, తుమకూరుకు వెళ్లి స్కానింగ్ చేయించుకుంటున్నట్లు తెలుస్తోందని, ఆయా ప్రాంతాల్లో లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకునేందుకు అక్కడి అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై బాలికలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు అరికట్టేలా హోర్డింగ్‌లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా అబార్షన్ జరిగితే వెంటనే ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు. హిందూపురంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో రాత్రి పూట స్కానింగ్ చేస్తున్నట్లు అంతరాష్ట్ర అధికారులు తెలపగా, చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎంటీ నాయక్, చిక్‌బల్లాపూర్ డీహెచ్ఓ డాక్టర్ మహేష్‌కుమార్, తుమకూరు డీహెచ్ఓ డాక్టర్ మంజునాథ్, డీఐఓ కృష్ణయ్య, డెమో బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అలసత్వం వీడాలి

అధికారులు అలసత్వం వీడి పని చేస్తేనే ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయగలమని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తదితర భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు.

ఎంతటివాడైనా వదిలేది లేదు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హాజరైన వ్యాపారులు

- చేనేత వ్యాపారులపై దాడి హేయం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

[illegible] : చేనేత వ్యాపారులను బంధించి దాడి చేసిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునే వరకూ విడిచిపెట్టబోమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని చేనేత వ్యాపారులు ఎమ్మెల్యే కేతిరెడ్డిని కలిశారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని 'ఆలయ సిల్క్స్' షోరూం యజమాని దాష్టీకాన్ని వివరించారు. ఈ సందర్భంగా బాధితులు కోటం ఆనంద్, గిర్రాజు శశి మాట్లాడుతూ, 'ఆలయ సిల్క్స్' షోరూం యజమాని పట్టుచీరలకు సంబంధించి తమకు రూ.2.33 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, వసూలు కోసం జూన్ 2వ తేదీన వెళ్లామన్నారు. డబ్బు అడిగినందుకు షోరూం యజమాని అవినాష్‌గుప్తా, అకౌంటెంట్ నాగేశ్వర్‌రావు తమపై దౌర్జన్యానికి దిగి చితకబాదారన్నారు. ఆ దృశ్యాలను వీడియో తీయించి ఈ విషయం బయటకు చెబితే సోషల్ మీడియాలో పెడతామని హెచ్చరించారన్నారు. దీంతో ఘటన గురించి తాము ఎవరికీ చెప్పలేదని, అయినప్పటికీ అతను ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టు చీరల వ్యాపారులను భయపెట్టి డబ్బులు ఎగ్గొట్టేందుకే ఇలా చేశారన్నారు. ఇందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పందిస్తూ, ఆలయ సిల్క్స్ షోరూం యజమానిపై విజయవాడలోనూ, ధర్మవరంలోనూ ఫిర్యాదు చేశామన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణాటాటాతో మాట్లాడనన్నారు. నిందితుడు ఎంతటి వాడైనా వదిలే ప్రశ్నే లేదన్నారు. చట్టపరిధిలో కఠినంగా శిక్షిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. అలాగే చేనేత వ్యాపారులంతా ఐక్యంగా ఉంటూ యూనియన్‌ను ఏర్పాటు చేసుకుంటే వైఎస్సార్‌సీపీ మద్దతుగా తప్పకుండా ఉంటుందన్నారు.

వారం పాటు పట్టుమార్కెట్ బంద్

ధర్మవరం చేనేత వ్యాపారులపై 'ఆలయ సిల్క్స్' యజమాని దాష్టీకానికి నిరసగా సోమవారం నుంచి వారం రోజుల పాటు పట్టు మార్కెట్‌ను బంద్ చేస్తున్నట్లు పలువురు వ్యాపారులు తెలిపారు. ఇందుకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా, ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో చేనేత వ్యాపారులు గద్దం శ్రీనివాసులు, గిర్రాజు నగేశ్, గిర్రాజు రవి, దాసరి లక్ష్మీనారాయణ (డీఎల్), గుర్రం రాజేంద్ర, చింతా కృష్ణయ్య, కాచర్ల అంజి, సిద్ది రాజేష్, గుద్దిటి సోమదాస్, బీరే జయచంద్ర, శాగా శీన, ఉడుముల రాము, జీవీ ప్రసాద్, పుట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై నాన్‌బెయిలబుల్ కేసులు

ఆలయ సిల్క్స్ షోరూం యజమాని అవినాష్‌గుప్త, సిబ్బంది నాగేశ్వరరావు, నాగులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. 342, 392, 394, 506, 324 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు విజయవాడ పోలీసు కమిషనర్ ధర్మవరం ఎమ్మెల్యేకు తెలిపారు. అందుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని కూడా పంపారు.